క్లుప్తంగా

మెటీరియల్ పంపిణీ


మెటీరియల్ పంపిణీ చేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో మగ్గంవర్క్, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలకు బుధవారం మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ద్వారా వేలమందికి శిక్షణ అందించి, వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. ఇప్పటివరకూ సుమారు 16,580 మందికి శిక్షణ అందించామని, మరో వందమంది శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. ఆసక్తి కలవారు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి వచ్చి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి దుర్గాదేవి, దివ్య, సత్యవేణి, సునీల పాల్గొన్నారు.

దుళ్ల సర్పంచ్ పట్టియ్యకు మాతృవియోగం


వీరాయమ్మ (ఫైల్)

కడియం: దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య మాతృమూర్తి వీరాయమ్మ (93) కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆమె మంగళవారం రాజమహేంద్రవరంలో తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతిక కాయాన్ని బుధవారం స్వగ్రామమైన దుళ్ల తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారు. వీరాయమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, పలువురు స్థానిక నాయకులు తరలివచ్చి ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు.

దుస్తుల పంపిణీ

కడియం: దామిరెడ్డిపల్లికి చెందిన సుజానమ్మ విజయరత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయరత్నం జ్ఞాపకార్థం బుధవారం వృద్ధులకు దుస్తులు, స్వీట్లు, మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ధర్మాసనం అన్నపూర్ణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్టు వైస్ చైర్మన్ కొండేటి వెంకట్రావు, దేవరపల్లి ఫ్రాన్సిస్, ఇసుకపట్ల సురేష్, డాక్టర్ సూర్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల అవసరాలు సత్వరమే తీర్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నగర బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక అన్నపూర్ణమ్మపేటలో రూ.15 లక్షలతో తాగునీటి పైపులైన్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మస్తాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురికి జైలు

కంబాలచెరువు: ఒక వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఒకరికి ఐదేళ్లు, ఇద్దరికి నాలుగేళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా.. సుబ్బారావు నగర్‌కు చెందిన దడాల సత్యనారాయణ 2019 నవంబర్ 28న తాను కుట్టిన దుస్తులు తీసుకుని సీటీఆర్ఐ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి వస్తూ.. దుర్గగుడి సెంటర్ వద్ద అష్టాచెమ్మా ఆడుతున్న తాటితోట ప్రాంతానికి చెందిన బంగారు అయ్యప్ప, రాయి సింహాద్రి, రాయి వెంకటేశ్వరరావు వద్దకు వెళ్లాడు. అక్కడ ఆట చూస్తున్న సత్యనారాయణపై ఆ ముగ్గురూ దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అతని జేబులోని రూ.230 లాక్కుని, తలపై కర్రతో తీవ్రంగా కొట్టారు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన సత్యనారాయణను చుట్టుపక్కల వారు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా, బాధితుడు కోలుకున్నాడు. దీనిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు కోర్టులో బాధితుడి తరఫున వాదనలు వినిపించారు. కేసుకు సంబంధించి త్రీటౌన్ సీఐ జి.మధుబాబు ఆధారాలు అందించారు.

ఘనంగా పీవీ జయంత్యుత్సవం

ప్రకాశం నగర్: ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గోదావరి బండ్ వద్ద గల పీవీ నరసింహారావు విగ్రహం వద్ద ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు బలరామ నాయుడు మాట్లాడుతూ సంస్కరణల యోధుడిగా పీవీ నరసింహారావు భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అనంతరం ముళ్లపూడి వెంకట రమణ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మరింత లబ్ధి

ధవళేశ్వరం: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందని జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, ఎంఎల్‌వో ఆకుల రాజా అన్నారు. ఈ మేరకు ధవళేశ్వరంలో బుధవారం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు సాధనాల చంద్రశేఖర్(శివ), తలారి వరప్రసాద్, గోలి దేవకుమార్, పేర్ల బాసి, ఎన్‌వీ శేఖర్, ఒంటెద్దు కృష్ణ ,రేగుళ్ల రాజు, హమీద్ బాషా పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతూ..

- ఖరీఫ్ వరినాట్లు ప్రారంభం
- బెంగాలీ కూలీలవైపే రైతుల మొగ్గు


రాజవోలు గ్రామంలో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

రాజమహేంద్రవరం రూరల్: ఖరీఫ్ వరినాట్లు మండలంలో ప్రారంభమయ్యాయి. వెంకట నగరం పంపింగ్ స్కీమ్‌తో పాటు బోర్ల కింద వ్యవసాయం కావడంతో ఇక్కడి రైతులు ముందస్తుగా పొలాలను దమ్ముచేసి నారుమళ్లు వేశారు. అనంతరం నాట్లను సైతం ప్రారంభించారు. మండలంలోని 1,512 హెక్టార్లలో రైతులు ఖరీఫ్ సాగుచేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఆర్‌బీకేలు, సహకార సొసైటీల్లో ఎరువులను సిద్ధంగా ఉంచింది. కాతేరు, వెంకట నగరం, తొర్రేడు, కొంతమూరు, కోలమూరు గ్రామాల్లో వెంకట నగరం పాత పంపింగ్ స్కీమ్ నుంచి విడుదలయ్యే సాగునీటితో పాటు బోర్ల కింద వ్యవసాయం చేస్తుంటారు. అలాగే బొమ్మూరు, హుకుంపేట, పిడింగొయ్యి, రాజవోలు గ్రామాల్లో బోర్ల కిందే రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో రైతులు పొలాలను దమ్ము చేసి నారుమళ్లు వేశారు. మండలంలో రెండు రోజుల నుంచి వరినాట్లు ఉత్సాహంగా మొదలయ్యాయి.

బెంగాలీ కూలీలతో ఖర్చు తక్కువ

పొలాల్లో వరినాట్లు వేసే మహిళల కూలి కంటే బెంగాలీ కూలీల ఖర్చు తక్కువ కావడంతో రైతులు వారి వైపే మొగ్గుచూపుతున్నారు. బెంగాలీ తరహాలో వరినాట్లు దూరంగా కాకుండా ఇక్కడ పద్ధతిలోనే దగ్గరగా వేయిస్తున్నట్లు రాజమహేంద్రవరం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బెంగాలీ కూలీలు వరినాట్లను చాలా తక్కువ సమయంలోనే పూర్తి చేస్తారన్నారు.

అందుబాటులో ఎరువులు



ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు అన్ని రైతు భరోసా కేంద్రాలు, సహకార సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయి. విత్తన శుద్ధి తర్వాతే నారుమడులు వేయాలి. ప్రస్తుతం మండలంలో వరినాట్లను రైతులు ప్రారంభించారు.

– అడపా భీమరాజు, రూరల్ మండల వ్యవసాయాధికారి

ఎగ్జిబిషన్‌లో అనాథ పిల్లల సందడి


ఎగ్జిబిషన్‌లో చిన్నారులతో ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ ఫిష్ టన్నల్‌ను మంగళవారం రాత్రి ఏకలవ్య చిల్డ్రన్స్ హోమ్ అనాథ శరణాలయం పిల్లలతో కలిసి ఎంపీ భరత్ రామ్ సందర్శించారు. పిల్లలతో కలిసి ఆనందంగా సందడి చేశారు. ఓ దివ్యాంగ బాలిక ట్రై సైకిల్‌ను నడిపించుకుంటూ ఆయన ఎగ్జిబిషన్‌లోకి వచ్చారు. హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు అనూప్ జైన్, ధర్మేంద్ర జైన్ ఈ పిల్లలందర్నీ ఇక్కడకు తీసుకొచ్చారని, ఈ చిన్నారులతో కలిసి ఎగ్జిబిషన్ తిలకించడం మరచిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీతో పలువురు సెల్ఫీలు దిగారు.

రోగుల వివరాలు నమోదు చేయాలి

కంబాలచెరువు: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఐహెచ్ఐపీ పోర్టల్‌లో రోగుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, దీనిపై నిర్లక్ష్యంగా వహిస్తే సంబంధిత ఆసుపత్రుల నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా సర్వేలైన్స్ అధికారి డాక్టర్ టి.రాజీవ్ హెచ్చరించారు. స్థానిక ఐఎంఏ హాలులో బుధవారం ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక, అంటు, సీజనల్ వ్యాధులతో ఆసుపత్రిలో చేరే రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఐహెచ్ఐపీ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. సీనియర్ డాక్టర్ ధర్మరాజు మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 పబ్లిక్ హెల్త్ ప్రకారం రోగుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఎపిడిమాలజిస్ట్ సుధీర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లా మలేరియా అధికారి పి.వీర్రాజు నమోదు చేసిన వివరాలను బట్టి ఆయా ప్రాంతాలలో వ్యాధి తీవ్రత ఎలా ఉందో తెలుసుకుని ముందస్తు చర్యలు చేపట్టవచ్చన్నారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ రవాణా సదుపాయం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఆర్టీసీ డీపీటీఓకి దృష్టికి పలు సమస్యలు


ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోకతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: రవాణా సదుపాయం లేక విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాజానగరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరంలో ఆర్టీసీ డీపీటీఓ అశోక షర్మిల దృష్టికి బుధవారం వివిధ గ్రామాల్లో విద్యార్థులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకువచ్చారు. ఈ గ్రీవెన్స్‌కు రాజానగరం నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, గ్రామపెద్దలు హాజరయ్యారు. తమ గ్రామాలకు రద్దు చేసిన సర్వీసుల పునరుద్ధరణతో పాటు కొన్ని కొత్త రూట్లలో సర్వీసులు ప్రారంభించాలని కోరారు.

బస్సులు లేక అవస్థలు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించినప్పుడు పలువురు విద్యార్థులు, ప్రజలు బస్సు సర్వీసులు లేక పడుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. కోవిడ్ సమయంలోనూ, రోడ్లు పాడైన సందర్భంగా పలు ఆర్టీసీ సర్వీసులను అధికారులు రద్దు చేశారని, దీనివల్ల పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారన్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రవాణా సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బంది పడకూడదని, విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో సమస్య పరిష్కరించడానికి ఆర్టీసీ డీపీటీఓ దృష్టికి సమస్యలు తీసుకొచ్చామన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి సమస్యలపై విన్నవించామన్నారు. రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దృష్టికి కూడా ఈ సమస్యలను తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్నం, అసిస్టెంట్ డిపో మేనేజర్ అజయ్ బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్రీవెన్స్‌కు తెలిపిన సమస్యలు

- గోకవరం బస్టాండ్ నుంచి చీపురుపల్లి వరకూ నడుస్తున్న బస్సును సీతానగరం, ముగ్గళ్ల, కాటవరం మీదుగా గోకవరం బస్టాండ్ వరకు తిప్పాలి. దీనివల్ల సుమారు 20 గ్రామాల ప్రజలకు సౌకర్యం కలుగుతుంది.
- గోకవరం నుంచి తంటికొండ, కోటి కేశవరం, చీపురుపల్లి, సీతానగరం మీదుగా పురుషోత్తపట్నం వరకూ బస్సు సర్వీస్ నడపాలి.
- కోరుకొండ మండలం బుచ్చింపేట నుంచి రాజమహేంద్రవరం వరకూ బస్సు వేయాలి.
- కొత్త తుంగపాడు, పాత తుంగపాడు, రాధేయపాలెం, శ్రీకృష్ణపట్నం, శ్రీరామపురం, దివాన్ చెరువు, హౌసింగ్ బోర్డు కాలనీ, కంబాల చెరువు మీదుగా రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్టాండ్ వరకూ సర్వీస్ నడపాలి.
- రాజమహేంద్రవరం నుంచి సంపత్ నగరం మీదుగా ద్వారపూడి వరకూ బస్సు సర్వీస్ నడపాలి.
- శ్రీరంగపట్నం నుంచి తుని వరకూ గతంలో ఉన్న బస్సును పునరుద్ధరించాలి. దానివల్ల అన్నవరం వెళ్లే భక్తులకు సౌలభ్యంగా ఉంటుంది. అలాగే బస్టాండ్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి.
- రాజమహేంద్రవరం నుంచి గోకవరానికి అనేక బస్సు సర్వీసులు ఉన్నప్పటికీ గుమ్మల దొడ్డి, అచ్యుతాపురం వద్ద రిక్వెస్ట్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలి.
- గోకవరం నుంచి జగ్గంపేట వయా గాదరాడ బస్సు సర్వీస్ నడపాలి.

హెచ్‌ఎం సేవలు అభినందనీయం


ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఎంఏవీఎల్‌వీ ప్రసాద్ సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారులు తులసీదాస్, చందుకుమార్ కొనియాడారు. బుధవారం ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బీఎస్‌వీఎస్ మూర్తి అధ్యక్షతన బదిలీపై వెళ్లిన ఎంఏవీఎల్‌వీ ప్రసాద్‌కు సన్మానం, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామపెద్దలు బొప్పన సుబ్బారావు, కురుమళ్ల ఆంజనేయులు, పసలపూడి శ్రీనివాస్, బాబూఖాన్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

రాజమహేంద్రవరం రూరల్: ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన కిలపర్తి శ్రీనివాసరావును మోరంపూడి జంక్షన్‌లో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో లారీ అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుమేరకు బొమ్మూరు ఎస్సై ఆర్.శివాజీ కేసు నమోదు చేశారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట


విద్యార్థిని అనూషను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజా

కంబాలచెరువు: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పంతం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బిక్కిన రవి, మంజు దంపతులు 80 సీలింగ్ ఫ్యాన్లు సమకూర్చారు. వాటిని బుధవారం ఎమ్మెల్యే రాజా, పంతం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావుల చేతుల మీదుగా ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐవో, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహమూర్తికి అందజేశారు. జగనన్న ఆణిముత్యాలులో భాగంగా ఇంటర్మీడియెట్ సీఈసీ గ్రూపులో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిన మాగాపు అనూషను సత్కరించి రూ.5 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. కళాశాల స్థాయిలో ప్రథమంగా నిలిచిన షేక్ రిజ్వా (ఎంపీసీ), కమలిని (బైపీసీ), భవాని (సీఈసీ), నూలి మేఘన (ఒకేషనల్)లకు జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. రాజా మాట్లాడుతూ తన తండ్రి, మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు ఈ కళాశాలలోనే చదువుకున్నారని గుర్తు చేశారు.

ప్రతిపక్షాల ఆరోపణలు అనైతికం

సీటీఆర్ఐ: జగన్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలను ప్రతిపక్షాలు మానుకోవాలని హితకారిణి సమాజం ట్రస్టు బోర్డు డైరెక్టర్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కందుకూరి విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులకు భద్రత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దన్నారు. ముఖ్యమంత్రి జగన్ తమ ట్రస్ట్‌బోర్డును నియమించడానికి ముందే ప్రస్తుత ఎంబీఏ కాలేజీ ప్రిన్సిపాల్ వి.విద్యా ప్రతిమను కళాశాల నిబంధనలకు వ్యతిరేకంగా అపాయింట్ చేశారని, ఉద్యమ నాయకుడు కార్తీక్ సింగంపల్లి ప్రశ్నించేంతవరకు వాస్తవాలు తమకు తెలియకుండా ఆమె జాగ్రత్త పడ్డారన్నారు. అనంతరం ఆమె సమావేశంలో తప్పు ఒప్పుకుని రాజీనామా చేస్తానని చెప్పడంతో సమస్య ముగిసిందన్నారు. తమ హయాంలో జరగని తప్పులను కూడా ముడిపెట్టి టీడీపీ నేతలు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ ఉమెన్స్ హాస్టల్ విషయాన్ని స్వయంగా పరిశీలించి ఇబ్బందులు లేకుండా హితకారిణి సమాజం ఆధ్వర్యంలో రన్ చేయాలని సూచించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి పలు నూతన కోర్సులను ప్రారంభించేందుకు డీఈడీ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు డైరెక్టర్లు దేవులపల్లి సరితారాణి, గుడాల ఆదిలక్ష్మి, కాలచర్ల శివాజీ, ఉంద్రు సత్యనారాయణ, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- బొమ్మూరులో గడపగడపకూ మన ప్రభుత్వం


గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయనను మరోసారి సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తెలిపారు. బొమ్మూరు గ్రామ సచివాలయం–4 పరిధిలో బుధవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నేతాజీనగర్ 15వ వీధి నుంచి చందన నాగేశ్వర్, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ పర్యటించారు. నాలుగేళ్లలో సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు విన్నవించిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను చందన నాగేశ్వర్ ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుకు ఓటమి కళ్లముందు కనిపిస్తోందన్నారు. అందుకే ఇవే తన చివరి ఎన్నికలంటూ సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కేవీ సుబ్బారెడ్డి, తిరుపతి రాయుడు, రాజేశ్వరి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, సద్గుణ రామారెడ్డి, ఎలుగొండ లక్ష్మి, దాకే శ్రీనివాస్, సోమన శ్రీనివాస్, తోడేటి రాహుల్, కాకులపాటి కుమార్, జాలామోషే, వైఎస్ కుమార్, కోటిపల్లి రవి, పమ్మినాని, పంచాయతీరాజ్ ఏఈ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో బుధవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ ఇంటింటి సర్వే నిర్వహించి, జ్వరం కేసులు ఉంటే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు రిఫర్ చేయాలన్నారు. నగరంలో అర్బన్ హెల్త్ సెంటర్లకు టైఫాయిడ్ నిర్ధారణ కిట్లు వెంటనే సరఫరా చేయాలని జిల్లా వైద్యశాఖాధికారిని కోరారు. సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

- బంగారు కొండ పథకంలో భాగంగా తాము దత్తత తీసుకొన్న గోరక్షణపేటలోని షేక్ ఫారూక్, గోపాల్ నగర్ పుంతలోని కొవ్వాడ దీక్షిత గృహాలను కమిషనర్ సందర్శించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి, ఆ పిల్లల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు తగిన తోడ్పాటు అందించాలని కోరారు.
- 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఈనెల 30వ తేదీలోగా వడ్డీ లేకుండా చెల్లించే అవకాశం ఉందని కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. జూలై ఒకటి నుంచి నూటికి రూ.2 చొప్పున వడ్డీ విధించబడుతుందన్నారు. పన్ను నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌంటరులోనే కాకుండా అన్ని సచివాలయాలు, ఆన్‌లైన్, చెక్కుల ద్వారా చెల్లించవచ్చునన్నారు.

తెలుగు హాస్యంపై నిండైన సంతకం ముళ్లపూడి


రచయిత సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: తెలుగు హాస్యంపై నిండైన సంతకం ముళ్లపూడి వెంకటరమణ అని వక్తలు కొనియాడారు. స్థానిక కంటే వీరన్న చౌదరి ఆసుపత్రి పైనగల బాలు సాంస్కృతిక మందిరంలో రాజమహేంద్రవరం ఆర్ట్స్, క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) సంస్థ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ పాత్రికేయుడిగా, రచయితగా, సినీరచయితగా ఆయన చేసిన పనిలోనూ హాస్యాన్ని మనకు అందించారన్నారు. రాకా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, సాహితీ గౌతమి అధ్యక్షుడు పి.విజయకుమార్, సాహితీవేత్త మహ్మద్ ఖాదర్ ఖాన్, కృష్ణమోహన్, జీవీ.రమణ, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత వారణాసికి సన్మానం

ప్రముఖ పాత్రికేయుడు, రచయిత వారణాసి సుబ్రహ్మణ్యాన్ని విశిష్ట అతిథిగా ఆహ్వానించి, ఆయనను మెమెంటో, శాలువాతో సత్కరించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వెంకటరమణతో తనకి గల సాన్నిహిత్యాన్ని వివరించారు.

20 మందిపై కేసులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వేస్టేషన్‌లో అనుమతి లేకుండా విక్రయాలు జరుగుతున్న 20 మంది హాకర్లను పట్టుకుని, వారిని ఆర్‌పీఎఫ్ సిబ్బందికి అప్పగించినట్లు విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో ఈనెల 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు కేటరింగ్ స్టాళ్లు, ప్లాట్‌ఫాం, రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. ఆ 20 మందీ ఏవిధమైన లైసెన్స్ లేకుండా అనధికారంగా అమ్మకాలు సాగిస్తున్నట్లు గుర్తించామన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి పి.విజయ్ భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక వై.జంక్షన్ వద్దగల రైతుబజార్‌లో కన్స్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి, అలాగే ఫిర్యాదులు ఏవిధంగా చేయాలో వివరించారు. కార్యక్రమానికి జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు అధ్యక్షత వహించారు. జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఎం.సునీల్ వినయ్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ ఎస్టేట్ ఆఫీసర్ రోజియా పాల్గొన్నారు.

ఉత్సాహంగా గృహసంపర్క్

ధవళేశ్వరం: బీజేపీ నాయకులు బుధవారం ధవళేశ్వరంలో గృహసంపర్క్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అందించిన పథకాలను వివరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వేంకటేశ్వర నగర్ వీధులు, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్, జేఎన్ రోడ్, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్, వాకర్స్ రోడ్, ఏవీ అప్పారావు రోడ్డు, కాంచన నగర్, వెంకటేశ్వర నగర్, వాకర్స్ పార్క్ ఎదురుగా వీధులు, డీవీబీ రాజు స్క్వేర్ 62 ప్లాట్ల ఏరియాలో విద్యుత్ ఉండదన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: ధవళేశ్వరం 10 ఎంఎల్‌డీ ప్లాంటు మెయింటెనెన్సు పనుల నేపథ్యంలో నగరంలో శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. 9, 10, 16, 17, 18, 19, 20 డివిజన్లలో ఈ ప్రభావం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ బస్సుయాత్ర

రాజమహేంద్రవరం రూరల్: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో బుధవారం రాయుడుపాకలు నుంచి కాతేరు వెంకటాద్రి గార్డెన్స్ వరకూ భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్యరథయాత్ర నిర్వహించారు. మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, పితాని సత్యనారాయణ, గొల్లపల్లి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సీటీఆర్ఐ: తెలుగుదేశం పార్టీ చేపట్టిన మన భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య బస్సుయాత్ర గురువారం నగరంలో కొనసాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

నగదు, బంగారం మాయం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాకు గౌతమీనగర్‌కు చెందిన సికా దుర్గా శ్రీనివాస్ పంచాయతీలో ఎలక్ట్రికల్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన మంగళవారం మరో అద్దె ఇంట్లోకి మారాడు. అయితే మంగళవారం నిద్ర చేయకూడదన్న సెంటిమెంట్‌తో కొత్త ఇంటికి తాళం వేసి, పాత ఇంటిలో కుటుంబ సభ్యులతో నిద్రించాడు. ఉదయం కొత్త ఇంటికి వచ్చేసరికీ తలుపు తాళం పగలగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని రూ.18 వేలు, 28.5 గ్రాముల బంగారం వస్తువులు మాయమయ్యాయి. వాటి విలువ రూ.89,250 ఉంటుంది. ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.